నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 16 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## తులం బంగారం ఇవ్వాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి



కల్యాణ లక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 15 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 40 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

## గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించిన సీపీ



గోదావరి బ్రిడ్జిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

జైపూర్, సెప్టెంబర్ 15 : జైపూర్ మండలం ఇందారం గోదావరిబ్రిడ్జివద్ద వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేయగా, ఆదివారం రామగుండం కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఇక్కడ రామగుండం మున్సిపాలిటీ, సింగరేణి సంస్థ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. బ్రిడ్జిపై టేబుల్స్, క్రేన్లు, సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సింగరేణి రెస్క్యూ సిబ్బందిని నియమించారు.



మాట్లాడుతున్న ఉమ్మడి ఎన్‌సీసీ జిల్లా కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ

## క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ

### ఉమ్మడి ఎన్‌సీసీ జిల్లా కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్‌శర్మ

ఎదులాపురం, సెప్టెంబర్ 15 : క్రమశిక్షణ, దేశభక్తి ఎన్‌సీసీతోనే సాధ్యమవుతుందని ఉమ్మడి ఎన్‌సీసీ జిల్లా కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్‌శర్మ అన్నారు. తెలంగాణ 32 బెటాలియన్ సీఏటీసీఐ ఏడో శిక్షణ శిబిరం జిల్లా కేంద్రంలోని వైటీసీలో అట్టహాసంగా ప్రారంభమైంది. పది రోజులపాటు కొనసాగే శిక్షణకు కల్నాల్ వికాస్ శర్మ పాల్గొని కేడెట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కల్నాల్ వికాస్ మాట్లాడుతూ.. దేశరక్షణ కోసం ఎన్‌సీసీ స్థాపించబడిందన్నారు. బ్రిటిష్ కాలం నుంచే యూనివర్సిటీ కేడెట్ పేరున కొనసాగేదని, 1947లో ఎన్‌సీసీగా పేరును మార్చడం జరిగిందన్నారు. యుద్ధ పరిస్థితులు వచ్చినప్పుడు ఎన్‌సీసీ కేడెట్లకు తొలి ప్రాధాన్యత ఇచ్చి సైన్యంలో చేర్చుకుంటారన్నారు. పది రోజులపాటు జరిగే శిక్షణలో కేడెట్లు మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఏలు జగ్గరాం, గాలి అశోక్, స్వామి, పూర్ణచందర్, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సాయినాథ్, వినోద్, కేర్టేకర్లు ఉమేశ్ కుమార్ పాల్, నరేందర్ పాల్గొన్నారు.

# నాడు అనుమతులు నేడు నోటీసులా?

**గతంలో చెన్నూర్‌లోని సర్వే నం.840లో చేపట్టిన నిర్మాణాలకు ఇంటి నంబర్లు**

- తాజాగా.. అందుకు సంబంధించిన దస్తావేజులు సమర్పించాలంటూ నోటీసులు
- అధికారుల ద్వంద వైఖరిపై బాధితుల ఆందోళన
- అప్పుడు సక్రమమం.. ఇప్పుడు అక్రమమా అంటూ ఆవేదన





ఇండ్లకు మున్సిపాలిటీ వారు అంటించిన నోటీసు

చెన్నూర్, సెప్టెంబర్ 15 : కొన్నేళ్లక్రితం చెన్నూర్ పట్టణంలోని సర్వే నంబర్ 840లోని ప్రభుత్వ భూమి(బిల్లాదాఖల్)ని ప్లాట్లు చేసి అమ్మకానికి పెట్టగా, సమీప గ్రామాల ప్రజలు కొనుగోలు చేశారు. అందులో షెడ్లు (ఇండ్లు) సైతం నిర్మించుకున్నారు. చెన్నూర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు షెడ్లు నిర్మించుకున్నవారికి అనుమతులు, ఇంటి నంబర్లను సైతం ఇచ్చారు. తర్వాత చెన్నూర్ మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత కూడా షెడ్లు కట్టుకున్న వారికి కూడా మున్సిపాలిటీ అధికారులు అనుమతులతో పాటు ఇంటి నంబర్లు ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వ భూమిలో షెడ్లు (ఇండ్లను) నిర్మించుకున్నారని, గతంలోని దస్తావేజులు మూడు రోజుల్లో సమర్పించాలని మున్సిపాలిటీ వారు నోటీసులు జారీ చేశారు. ఇట్టి నోటీసులను సర్వే నంబర్ 840లో నిర్మించుకున్న ప్రతి ఇంటికీ అంటించగా, యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దరఖాస్తు చేసుకుంటే అనుమతులతో పాటు ఇంటి నంబర్లు కూడా ఇచ్చారని, ఈ వివరాలు మున్సిపాలిటీ ఆన్‌లైన్‌లో కూడా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఇది ప్రభుత్వ స్థలమైతే అప్పట్లో అధికారులు తమకు అన్ని రకాల అనుమతులు, ఇంటి నంబర్లు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో అన్ని రకాల దస్తావేజులు సమర్పించిన తర్వాతే తమకు ఇంటి నంబర్లు ఇచ్చారని, ప్రస్తుతం మరోసారి దస్తావేజులు సమర్పించమని నోటీసులు ఎందుకు ఇచ్చారో అంతుపట్టడం లేదని వారు పేర్కొంటున్నారు. అప్పట్లో తాము సమర్పించిన దస్తావేజులు ఏమయ్యాయని, ఇలా ఎన్నిసార్లు అడుగుతారని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మారినప్పుడల్లా దస్తావేజులు అడుగుతారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదట్లోనే ఈ అక్రమ నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు, అప్పటి గ్రామ పంచాయతీ సిబ్బంది, తర్వాత మున్సిపాలిటీ అధికారులు అడ్డుకోవాల్సి ఉండేది. కానీ, వారు మిన్నకుండి పోవడంతో ఈ ప్రభుత్వ భూములను బ్రోకర్ల ద్వారా కొనుగోలు చేసి.. వారి ఆర్థిక స్తోమతను బట్టి భవనాలు, షెడ్లు నిర్మించుకున్నారు. అప్పట్లోనే అధికారులు అడ్డుకుంటే తాము ఇంటి స్థలాలను కొనుక్కునే వారమే కాదని వారు చెబుతున్నారు.



సర్వే నంబర్ 840లో నిర్మించిన ఇండ్లు

### అధికారుల తీరుతో అన్యాక్రాంతం

అప్పట్లో అధికారులు వ్యవహరించిన తీరుతోనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా చెన్నూర్ పట్టణ శివారులోని వందలాది ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ భూములని, ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఇటు రెవెన్యూ అధికారులు, అప్పటి గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆపై మున్సిపాలిటీ అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించారు. అంతేగాకుండా అప్పటి అధికారులు అందిన కాడికి దండుకొని అక్రమ నిర్మాణాలకు అనుమతులతో పాటు ఇంటి నంబర్లు కేటాయించి, ఆన్‌లైన్ రికార్డుల్లో పొందుపర్చినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ప్రభుత్వ నిర్మాణాల కోసం అవసరమైన భూమి లేకపోవడంతో అధికారులు ఆ భూమిని తీసుకునేందుకు వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు అర్థమవుతున్నది. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇస్తూనే, అప్పట్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు, ఇంటి నంబర్లు ఎలా కేటాయించారు అనే విషయాలపై విచారణ జరిపి, అందుకు బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇండ్లకు నోటీసులు జారీ చేసే విషయమై వివరణ కోరేందుకు మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్‌ను ప్రయత్నించగా అందుబాటులో లేరు.



బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షుడు శ్రావణ్

## మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి యత్నం

### బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ అరెస్ట్

బెల్లంపల్లి, సెప్టెంబర్ 15 : నీట్ జీవో నంబర్ 33 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి యత్నించిన బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి స్వామి యాదవ్‌తో పాటు బెల్లంపల్లికి చెందిన శ్రావణ్‌ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్రావణ్ మాట్లాడుతూ నీట్ జీవో 33ను రద్దు చేసి స్థానికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని 24వేల మంది విద్యార్థులు నీట్‌లో ప్రవేశాలు కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

# మూగ వేదన

**జిల్లాలో జోరుగా పశువుల అక్రమ రవాణా**

- గుట్టుచప్పుడుకాకుండా కంటెయినర్లలో తరలింపు
- కిక్కిరిసి ఎక్కిస్తుండడంతో ఊపిరాడక చనిపోతున్న మూగజీవాలు
- అధికారుల తీరుపై ఆరోపణలు



వాహనంలో పరిమితికి మించి ఎక్కించడంతో మృతి చెందిన పశువులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లా నుంచి పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. కొందరు దళారులు జిల్లాలోని సంతల్లో పశువులను కొనుగోలు చేసి నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. కొందరైతే అడవుల్లో మేతకు వెళ్లిన పశువులను దొంగతనంగా తీసుకొచ్చి వాహనాల ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారు. ఇక వాహనాల్లో కిక్కిరిసి ఎక్కించడం వల్ల ఊపిరాడక పశువులు మృత్యువాత పడుతున్నాయి.

### సంతల్లో కొనుగోలు చేసి.. రాత్రి వేళల్లో తరలింపు

మహారాష్ట్ర-సిర్పూర్-టీ అంతర్రాష్ట్ర రహదారి మీదుగా సిర్పూర్-టీ, కౌటాల, గూడెం, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్, కడంబా, కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు మీదుగా, వాంకిడి నుంచి ఆసిఫాబాద్ మీదుగా హైదరాబాద్.. కరీంనగర్ తదితర పట్టణాలకు పశువులను కంటెయినర్లలో తరలిస్తున్నారు. జిల్లాలోని వాంకిడి, కౌటాల, జైనూర్, సిర్పూర్ మండలాల్లోని పశువుల సంతల్లో, మహారాష్ట్రలోని గోయగాంలోని వారసంతలో దళారులు పశువులను కొనుగోలు చేసి రాత్రి వేళ్లల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. సిర్పూర్-టీ నుంచి కాగజ్‌నగర్ వరకు, రెబ్బెన నుంచి మంచిర్యాల జిల్లా దాటేవరకు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నారు. తరలింపు సమయంలో పోలీసులు తనిఖీల విషయాన్ని ఏజెంట్లు దళారులకు అందిస్తుంటారు. దొంగదారుల్లో పశువులను పట్టణాలకు తరలిస్తుంటారు. జిల్లాలో రెండు మూడు రోజులకో చోట ఈ ఘటన వెలుగుచూస్తున్నది. అధికారులను మచ్చిక చేసుకొని పశువులను అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



పశువులను తరలిస్తూ రెబ్బెనలో పట్టుబడ్డ డీసీఎం



వాంకిడి టోల్‌ప్లాజా వద్ద పశువులతో పట్టుబడ్డ కంటెయినర్

### తీరుమార్చిన స్మగ్లరు..

గతంలో వ్యాన్లు, ట్రక్కులు, లారీల్లో పశువులను అక్రమంగా తరలించిన స్మగ్లరు ఇప్పుడు కంటెయినర్లు వాడుతున్నారు. పరిమితికి మించి కంటెయినర్లలో కిక్కిరిసి ఎక్కించడం వల్ల మూగ జీవాలు ఊపిరాడక మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల రెబ్బెనలో పట్టుబడ్డ కంటెయినర్‌లో 24 పశువులను ఎక్కించగా, అందులో 9 మృత్యువాత పడ్డాయి. రెబ్బెనలోని ఏవో బ్రిడ్డి సమీపంలోని అడవిలో చనిపోయిన పశువులను పడేసేందుకు కంటెయినర్‌ని ఆపగా, అదే సమయంలో అక్కడికి వెళ్లిన పోలీసులు గమనించి వాహనాన్ని పట్టుకున్నారు. కంటెయినర్లలో ఎంత క్రూరంగా జీవాలను తరలిస్తున్నారనే దానికి ఈ ఘటనే నిదర్శనం. గత నెల 27న వాంకిడి టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీల్లో పశువులను తరలిస్తున్న కంటెయినర్‌ని పోలీసులు పట్టుకున్నారు.

## నవోదయలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో ఖాళీ పోస్టుల భర్తీకి ఈ నెల 21న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ ఉండాలని పేర్కొన్నారు. పీజీటీ-ఐటీ కోసం బీఎడ్‌తో పాటు ఎంఎస్‌సీ కంప్యూటర్/ఎంటెక్, ఎంసీఏ, పీజీటీ-చరిత్ర కోసం బీఎడ్‌తో పాటు చరిత్ర ఎంఏ, పీజీటీ-ఇంగ్లిషు కోసం బీఎడ్‌తోపాటు ఇంగ్లిషులో ఎంఏ, టీజీటీ-ఆర్ట్ కోసం గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఫైన్ ఆర్ట్స్/క్రాఫ్ట్స్‌లో డిగ్రీ(బీఎఫ్‌ఏ), ఆర్‌ఐఈ ఎడ్యూకేషన్ నుంచి ఆర్ట్స్‌లో బీఎడ్ డిగ్రీ, హిందీ, ఇంగ్లిషులో బోధనా ప్రావీణ్యం, కంప్యూటర్ అవగాహన కలిగి ఉండాలని, 1 జూలై 2024 నాటికి గరిష్ట వయోపరిమితి 50 ఏళ్లు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు ఫారం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ధ్రువీకరణ నకళ్లను అందజేయాలని కోరారు.








మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

## యువత ఎదుగుదలకు కృషి చేస్తా

### బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్పీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15: సిర్పూర్ నియోజకవర్గంలో యువతీ యువకులు పీజీలు చేసి వ్యవసాయ కూలీలుగా ఉన్నారని, వారి ఎదుగుదలకు తనవంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో టాటా కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్పీ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో ఇండస్ట్రియల్స్, ఉపాధి అవకాశాలు లేక యువత కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో ఇక్కడి పాలకులు సట్టా మట్కా, అక్రమ దందాలకు అలవాటు చేసి యువత జీవితం నాశనం చేశారన్నారు. సకాలంలో ఉద్యోగాలు రాక అనేక మంది వ్యసనాలకు బానిస అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా టాటా కంపెనీ ప్రతినిధులతో సెమినార్ నిర్వహించినట్లు తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన కంపెనీలో వివిధ సెక్టార్‌లలో ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ సెమినార్‌కు విశేష స్పందన వచ్చిందని, నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలి వచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మిన్‌హాజ్, టాటా కంపెనీ సీనియర్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి సహకరించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : శాంతియుత వాతావరణంలో వినాయకులను నిమజ్జనం చేసేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగును పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయాచోట్ల మండపాలను సందర్శించారు. శోభాయాత్ర సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు సుధాకర్, మహేందర్ ఉన్నారు.



నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస రావు



పెద్ద చెరువు వద్ద గణేశుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన గిల్డా, వైస్, చైర్మన్, కౌన్సిలర్లు, భక్తులు

## బైబై గణేశా..

### చెన్నూర్ పట్టణంలో ప్రశాంతంగా నిమజ్జనం

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 15 : పట్టణంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సోమవారం ఉదయం వరకూ కొనసాగింది. స్థానిక మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన గిల్డా, వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కమిషనర్ గంగాధర్, కౌన్సిలరు జోడు శంకర్, కో ఆప్షన్ మెంబర్లు, బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, నాయిని సతీశ్, కో ఆప్షన్ మెంబర్ కేయం శ్రీనివాస్, ఏఈ సాయి అర్చకులు, హిందూ ఉత్సవ సమితి, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్, పోలీస్, అటవీశాఖ, వైద్య శాఖలు సంయుక్తంగా పాల్గొన్నాయి. మహంకాళివాడ, గెర్రెకాలనీ, బలిజవాడతో పాటు పట్టణంలోని పలు కాలనీల్లో వినాయులను నిమజ్జనం చేశారు. ప్రధాన వీధుల్లో భక్తులు కోలాటాలు, నృత్యాలు, భజనలతో సందడి చేశారు. గాంధీచౌక్‌లో చెన్నూర్ మున్సిపాలిటీ, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేదిక ఏర్పాటు చేశారు. పెద్ద చెరువు వద్ద గజఈతగాళ్లతో పాటు బోటును అందుబాటులో ఉంచారు. పెద్ద చెరువులో భారీ క్రేన్ సాయంతో పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక చానళ్లలో శోభాయాత్రను ప్రత్యక్ష ప్రసారం చేశారు.

కెరమెరి, సెప్టెంబర్ 15 : మండలంలోని జ్యోతినగర్(ఝురి) గ్రామంలో వినాయక నిమజ్జనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధులగుండా శోభాయాత్ర సాగింది. ఖైరి పెద్ద వాగులో గణనాథుని నిమజ్జనం చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు.








